సాక్షి
ఏలూరు
గురువారం । 7 । నవంబర్ । 2024



'తల్లీబిడ్డ' సేవలు దూరం

ప్రసవం తరువాత తల్లీబిడ్డను సురక్షితంగా ఇంటికి చేర్చే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా కుంటుపడే దిశగా నడుస్తున్నాయి. 10లో



అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

ఉంగుటూరు మండలం కైకరం జెడ్పీ హైస్కూల్ గ్రౌండులో అండర్-14 బాలుర, బాలికల విభాగంలో అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. 10లో



ఏలూరు అథ్లెట్లకు పతకాలు

ఏలూరు క్రీడాకారులు అద్భుత ప్రతిభ చాటి పతకాల పంట పండించారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ పోటీలకు అర్హత సాధించారు. 10లో

పేదోడి చదువులపై పగ

- ఇప్పటికీ విడుదల కాని ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఫీజులు కట్టకపోతే పరీక్షలకు పంపమంటున్న యాజమాన్యాలు
- చదువు పూర్తయినా సర్టిఫికెట్లు అందని పరిస్థితి
- ఉద్యోగాలు కోల్పోతున్నామని ఆవేదన



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పేదలకు చదువులకు కూటమి ప్రభుత్వం మోకాలడ్డుతోంది. పేదల బిడ్డలకు ఉన్నత చదువులు అందకూడదని, వారికి మంచి భవిష్యత్ దక్కకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యాసంవత్సరం ప్రారంభమైన మూడు నెలల్లోపే కన్వీనర్ కోటాలో సీట్లు సాధించిన విద్యార్థులకు సంబంధించిన ఫీజులను ఆయా కళాశాలల యాజమాన్యాలకు చెల్లించేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తారుమారయ్యింది. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా విద్యార్థుల ఫీజులను కళాశాలలకు చెల్లించలేదు. దీంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయి.

పడకేసిన పథకాల అమలు

ట్యూషన్ ఫీజుల చెల్లింపులు నిలిచిపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వసతి దీవెన సాయంతో హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు వసతి దీవెన చెల్లించకపోవడంతో విద్యార్థులు అప్పులు చేసి హాస్టల్ ఫీజులు, భోజన ఖర్చులు భరించాల్సి వస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ హయాంలో అమలైన పథకాలకు పేర్లు మార్పించే కానీ వాటి అమలును మాత్రం పూర్తిగా విస్మరించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు ఇంతవరకూ విడుదల కాకపోవడంతో విద్యార్థుల చదువులు గాలిలో దీపంలా మారాయి. విద్యా సంవత్సరం ఇప్పటికే దాదాపు సగం పూర్తయ్యింది. ప్రస్తుతం ఇంజినీరింగ్ తదితర చదువుల్లో సెమ్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఫీజులు చెల్లించలేదు కాబట్టి మీరే సొంతంగా కట్టాలి, లేకుంటే పరీక్షలకు పంపేది లేదని యాజమాన్యాలు చెబుతున్నాయి.

సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు

కొలువుల్లో చేరడానికి సర్టిఫికెట్లు అవసరం కాగా వాటిని ఇవ్వకుండా యాజమాన్యాలు మొండిగా వ్యవహరిస్తున్నాయి. నెలలోపు ఉద్యోగాల్లో చేరాలని, లేకుంటే ప్రత్యామ్నాం చూసుకోవాలని ఆయా సాఫ్ట్‌వేర్ సంస్థలు నూతనంగా కొలువులు సంపాదించిన వారికి అల్టిమేటం జారీ చేశాయి. నెల రోజుల్లోపు వారి సర్టిఫికెట్లు వారి చేతికి రావాలంటే యాజమాన్యాలకు పూర్తి బకాయిలు చెల్లించాలి. ప్రభుత్వం ఇప్పట్లో రీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లించే పరిస్థితి లేదు. పలువురు అభ్యర్థులు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదంలో పడ్డారు. గత ప్రభుత్వం చివరి త్రైమాసికంలో రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు కసరత్తు చేస్తున్న సమయంలో ఎన్నికల కోడ్ రావడం, పేదల ఉన్నత చదువులపై పగబట్టిన కూటమి పార్టీల నేతలు కోడ్‌ను సాకుగా చూపి రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకుండా కోర్టుకి వెళ్లాయి. అప్పటి ప్రభుత్వం ఆ త్రైమాసికం ఫీజులు చెల్లించలేకపోయింది.

గత ఐదేళ్లలో జిల్లాలో విద్యా దీవెన, వసతి దీవెన లబ్ధిదారుల వివరాలు

సంవత్సరం	విద్యాదీవెన విద్యార్థులు	లబ్ధి (రూ.కోట్లలో)	వసతి దీవెన విద్యార్థులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	36,527	95.78	36,580	36.86
2020-21	37,148	77.97	37,750	35.76
2021-22	38,677	105.67	36,350	34.76
2022-23	33,655	81.53	32,316	30.96
2023-24	29,111	22.45	----	----

ఫీజులు వెంటనే విడుదల చేయాలి



మా నాన్న దినసరి కూలీగా పని చేస్తాడు. ఒక్క రూపాయి కూడా ఫీజు చెల్లించే అవసరంలేదంటే గత ఏడాది నగరంలోని ఒక ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్‌లో చేరాను. బీటెక్ ద్వితీయ సంవత్సరం త్రైమాసిక ఫీజు చెల్లించాలని కళాశాల యాజమాన్యం లెటర్ పంపడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉన్నాం.

– ఎం.సాయి, బీటెక్ విద్యార్థి

నా కల నెరవేరదేమో?



మా నాన్న మెకానిక్‌గా చేస్తూ కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంకు రావడంతో ఇంజనీరింగ్‌లో చేరాను. ఫీజులు కట్టకపోతే సెమ్ పరీక్షకు పంపమని కళాశాల యాజమాన్యం చెప్పింది. నాన్న ఆదాయం కుటుంబ పోషణకే సరిపోతుంది. ఫీజు కట్టలేని పరిస్థితి. నా కల నెరవేరదేమోనని ఆవేదనగా ఉంది.

– ఇమ్మంది పవన్ కుమార్, బీటెక్ విద్యార్థి

జనవరిలో టీటీసీ కోర్సులకు పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులైన డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ, వీవింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు వచ్చే 2025 జనవరిలో జరుగుతాయని, ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష ఫీజులు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని పరీక్ష ఫీజులు అదే వెబ్‌సైట్‌లో పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలని సూచించారు. వెబ్ దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని వాటిని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమర్పించవచ్చన్నారు. డ్రాయింగ్ లోయర్ పరీక్షకు రూ.100, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, హ్యాండ్లూమ్ వీవింగ్ లోయర్ పరీక్షకు రూ.150 చొప్పున, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, హ్యాండ్‌లూమ్ వీవింగ్ హయ్యర్ పరీక్షకు రూ.200 చొప్పున ఫీజులు చెల్లించాలన్నారు. ఈ నెల 31లోపు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా, డిసెంబర్ 10లోపు రూ.50 అపరాధ రుసుంతో, డిసెంబర్ 13లోపు రూ.75 అపరాధ రుసుంతో ఫీజులు చెల్లించవచ్చన్నారు.

డీఈఎల్‌ఈడీ పరీక్షకు 52 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా కేంద్రం ఏలూరులో జరుగుతున్న డీఈఎల్‌ఈడీ పరీక్షకు బుధవారం మొత్తం 52 మంది హాజరయ్యారు. 2వ సెమిస్టర్ పరీక్షకు 47 మందికి గాను 47 మంది హాజరు కాగా, ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షకు 11 మందికి గాను ఐదుగురు హాజరయ్యారు.

న్యూస్‌రీల్

పక్కాగా ధాన్యం సేకరణ

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి



ఏలూరు(మెట్రో): జిల్లాలో పకడ్బందీగా ధాన్యం సేకరణ చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో మాట్లాడుతూ ఈ ఏడాది 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 250 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సిబ్బందికి శిక్షణ అందించామన్నారు. ఇంతవరకు 11 రైతు సేవా కేంద్రాల ద్వారా రూ.1.22 కోట్ల విలువైన 610 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు రైతు ఖాతాలో సొమ్ము జమ చేస్తున్నామన్నారు. తేమ శాతం విషయంలో 17 శాతం సడలింపు ఉంటుందన్నారు. ధాన్యం కొనుగోలులో ఏవైనా సమస్యలు ఎదురైతే 7702003584 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు ఈ సీజన్‌లో 80 లక్షల గోనె సంచులు అవసరమవుతాయని అంచనా వేశామని, ఇప్పటికే 64,84,352 గోనె సంచులు అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యం రవాణాకు చెందిన వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం తేమ, ఇతర విషయాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు కమిటీలు కూడా వేశామన్నారు. దీపం పథకం-2 కు సంబంధించి జిల్లాలో ఇంతవరకు 70 వేల మంది బుకింగ్ చేసుకోగా 33 వేల మందికి సిలెండర్లు అందజేశామన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఏలూరు కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): విద్యారంగం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లేకపోవటం సిగ్గుచేటన్నారు. హాస్టల్లో పెండింగ్ ఉన్న మెస్ చార్జీలు విడుదల చేయాలని, డిగ్రీ సెమిస్టర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం కింద ఒక్కో విద్యార్థికి రూ.15,000 విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల నియమావళి అమలుకు ఎంసీసీ బృందాలు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కోసం ప్రత్యేక అధికార బృందాలను నియమిస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. మున్సిపల్, మండల స్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును ఈ బృందాలు పర్యవేక్షిస్తాయన్నారు. మున్సిపల్, మండల వారీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కోసం 22 ఎంసీసీ బృందాలు, 21 స్పెషల్ వీడియో బృందాలు ఏర్పాటు చేశారు.

ఇసుక రవాణాతో పంటలకు నష్టం



రాజవరం ఎర్రకాలువ సమీపంలో ఆందోళన చేస్తున్న రైతులు

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ పరిధిలోని ఎర్రకాలువ వెంట ఇసుక రవాణాకు బ్రేక్ పడింది. బుధవారం రాజవరం, మంగపతిదేవిపాలెం, గంగవరం గ్రామాలకు చెందిన రైతులు ఇసుక రవాణా వల్ల పంటలకు నష్టం వాటిల్లుతుందని రహదారికి భారీ గోతులు పడి అధ్వానంగా తయారైందని ఆరోపిస్తూ ఇసుక రవాణాను అడ్డుకున్నారు. దీంతో వందలాది ట్రాక్టర్లు నిలిచిపోవడంతో ఇసుక రవాణాదారులు, రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కె.చెల్లన్నదొర రెవెన్యూ సిబ్బందితో గంగవరానికి చేరుకున్నారు. రైతులకు ఇసుక ఎగుమతిదారులకు మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఇసుక సరఫరా తాత్కాలికంగా నిలిపివేశారు.

అపార్ నమోదుపై ప్రత్యేక దృష్టి

ఏలూరు(మెట్రో): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్టర్(అపార్) నమోదు యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలోని ఎంఈఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అపార్ ఆధార్ అనుసంధానికి సంబంధించిన ప్రక్రియపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా అపార్ నమోదు కార్యక్రమంలో జిల్లాను ముందుంచడానికి 24 గంటల్లో నూరుశాతం పూర్తిచేసి నివేదికను అందజేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నమోదు ప్రక్రియకు అవసరమైయితే సచివాలయాల సిబ్బందిని ఉపయోగించుకోవాలని సూచించారు. కొన్ని ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలలు అపార్ నమోదు కార్యక్రమాన్ని ఇప్పటికీ ప్రారంభించలేదని తన దృష్టికి వచ్చిందని దీనికి సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి నమోదుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

మెరుగైన సేవలందించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని కొత్తపేట ప్రాంతంలోని 41, 42 డివిజన్లకు సంబంధించిన వార్డు సచివాలయాన్ని బుధవారం కలెక్టర్ కె. వెట్రిసెల్వి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన విధుల నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు వారి పరిధిలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. వాటర్, ఇంటిపన్ను వసూళ్ల తీరును సంబంధిత రిజిస్టర్ ద్వారా పరిశీలించారు. వీధిలైట్ల విషయంలో సచివాలయ సిబ్బంది స్పందించి అన్ని చోట్లా వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయం ద్వారా అందిస్తున్న సేవల ద్వారా వచ్చిన నగదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత నగదును వసూలు చేసిన 24 గంటలలోగా బ్యాంకులో జమ చేయాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనరు ఎ.భానుప్రతాప్, తహసీల్దారు జి.వి.శేషగిరి, డిప్యూటీ కమిషనరు శివారెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళకు 'అభయ' భద్రత

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో మహిళల భద్రత కోసం ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో బుధవారం ఎస్పీ శివ కిషోర్ ఆధ్వర్యంలో చేపట్టిన అభయ మహిళా సేఫ్టీ లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ హాజరయ్యారు. కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఐజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అభయ మహిళా భద్రత పేరుతో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాన్ని అభినందించారు. పోలీసు వ్యవస్థలో 30 శాతం మహిళా పోలీస్ సిబ్బంది పని చేస్తున్నారనీ, మహిళల రక్షణకు మహిళా పోలీసులు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు శ్రద్ధ వహించాలని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ శాఖకు సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ.. మహిళా భద్రతకు ఈ అభయ యాప్‌ను రూపొందించామని, 9550351100 ఫోన్ నెంబరు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామంలోనూ వార్డుల్లో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. ఏదైనా నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేసే కంటే, నేరం జరగకుండా చూడాల్సిన ముఖ్యమైన పాత్రను గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు వహించాలని ఎస్పీ చెప్పారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. అదనపు ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు, డీఎస్పీ డీ.శ్రావణ కుమార్, ఏఆర్ ఆర్ఐ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అభయ మహిళ లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ ప్రతాప శివ కిషోర్, జేసీ ధాత్రిరెడ్డి తదితరులు

పొగాకు సాగులో యాంత్రీకరణ అవసరం



పొగాకు మొక్కలను యంత్రాలతో నాటే విధానాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ శేషుమాధవ్

బుట్టాయగూడెం: పొగాకు సాగులో యాంత్రీకరణ అవసరమని ఐసీఏఆర్- సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. జీలుగుమిల్లి ఐసీఏఆర్ కేంద్ర పొగాకు పరిశోధన కేంద్రంలో పొగాకు మొక్కలు యంత్రాల ద్వారా నాటే విధానాన్ని శేషుమాధవ్ బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పొగాకు సాగులో కూలీల వినియోగం తగ్గించి యాంత్రీకరణతో సాగు చేసి వ్యయం తగ్గించుకోవచ్చని చెప్పారు. జీలుగుమిల్లి పరిశోధనా కేంద్రంలో 6 పొగాకు బేరన్‌ల నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సీటీఆర్ఐ ఐక్రాప్ మేనేజ్‌మెంట్ హెడ్ డాక్టర్ రాజశేఖర రావు, పరిశోధనా కేంద్రం హెడ్ డాక్టర్ వైవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో నేరాల నియంత్రణ, కేసులు త్వరితగతిన దర్యాప్తు చేయటం, నేరస్తుల కదలికలపై నిత్యం నిఘా, నిందితులను అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరుపరచటంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ చెప్పారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ శివకిషోర్ మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల వేదికలోని ఫిర్యాదులు, వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, నిర్దేశిత గడువులోగా వాటి వివరాలను జిల్లా కేంద్రానికి పంపాలని ఆదేశించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచాలన్నారు. పేకాట, కోడిపందాలు నిర్వహించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు.



నేర సమీక్షలో ఎస్పీ శివకిషోర్, చిత్రంలో అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఉచిత ఇసుక సులభంగా పొందేలా చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఇసుక సులభంగా పొందేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డివిజన్‌లో తీపర్రు-2 - 3, ఔరంగాబాద్ ఇసుక రీచ్‌ల నుంచి నేరుగా గాని, ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డు ద్వారా బుక్ చేసుకుని ఉచిత ఇసుకను పొందేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. లోడింగ్ చార్జీలు, రవాణా చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సందేహాలు ఉంటే 93914 45753, 86682 91997 నెంబర్లలో తెలియజేయాలన్నారు.

షాడో ఎమ్మెల్యే దందా

- ఏలూరులో సొంత పార్టీ నేతలపైనే బెదిరింపులు
- కొందరి నుంచి భారీగా వసూళ్లు
- షాడో తీరుపై ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ నివేదిక



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరులో షాడో నేతల దందాలు తారాస్థాయికి చేరాయి. వివాదాస్పద స్థలాలు మొదలుకొని సొంత పార్టీ, ప్రతిపక్ష పార్టీ చోటా నేతల వరకు అందరినీ టార్గెట్ చేస్తున్నారు. లెక్కకు మించి పంచాయితీలు చేస్తూ భారీగా సొమ్ము చేసుకోవడంపై అధికార పార్టీలోనే తీవ్ర చర్చ జరుగుతోంది.

ఏలూరు నగరంలో ప్రజాప్రతినిధి పేరుతో షాడో ఎమ్మెల్యే చేస్తున్న హడావుడికి పోలీస్ ఉన్నతాధికారులు సైతం బెంబేలెత్తుతున్నారు. 2009లో ప్రజారాజ్యం ద్వారా క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యే సోదరులతో ఉంటూ రాజకీయం సాగిస్తున్నాడు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే బడేటి చంటికి సర్వం తానే అనే రీతిలో పనిచేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో షాడో ఎమ్మెల్యేగా నగరంలో గుర్తింపు పొంది హల్‌చల్ చేస్తున్నాడు.

బెదిరించి వసూళ్లు

నగరంలో ప్రతి పంచాయితీలో కీలక భూమికగా పోషించడంతో పాటు తానే ప్రజాప్రతినిధి అనే రీతిలో వ్యవహరిస్తూ పోలీసులకు తలనొప్పిగా మారాడు. 2022లో జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికల్లో నలుగురు టీడీపీ అభ్యర్థులు విత్‌డ్రా కావడంతో ఏకగ్రీవాలయ్యాయి. ఈ క్రమంలో అధికారంలోకి రాగానే నలుగురు టీడీపీ చోటా నేతల్ని టార్గెట్ చేశారు. బెదిరించి వారి నుంచి వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఒక టీడీపీ నేతను బెదిరించి తమ వద్దకు పిలిపించుకుని నలుగురు నేతలతో కలిసి అతనిపై దాడి చేయడంతో ప్రభుత్వాసుపత్రిలో బాధితుడు చికిత్స పొందాడు. ఈ ఘటనకు సంబంధించి సదరు నేతతో పాటు మరికొందరిపై కేసు నమోదైంది. నగరంలోని ఒక మైనార్టీ నేతను ఇంటికి పిలిపించుకుని కాళ్లు పట్టించుకున్న వీడియో టీడీపీ గ్రూప్‌లోనే హల్‌చల్ చేసింది. పోణంగి గ్రామానికి చెందిన కొప్పుల వెలమ సామాజికవర్గ నేత సూర్యప్రకాష్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిని కలిసి వస్తున్న క్రమంలో మధ్యలో ఆపి దాడి చేశారు.

డీఎస్పీతో ఘర్షణ

కొద్దిరోజులు క్రితం ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌తో షాడో ఎమ్మెల్యే గొడవకు దిగాడు. మార్కెట్ యార్డు సమీపంలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదంలో షాడో జోక్యం చేసుకున్నారు. పరిస్థితి అదుపు తప్పుతున్న క్రమంలో డీఎస్పీ సంఘటనా స్థలానికి వెళ్లడంతో ఘర్షణ జరిగినట్లు సమాచారం. ఇప్పటికే సదరు నేతపై పోలీసు శాఖకు నాలుగు ఫిర్యాదులు అందాయి. ఏలూరు నగరంలో ఏం జరుగుతుందనే దానిపై ఇంటెలిజెన్స్ అధికారులు పూర్తి నివేదిక ప్రభుత్వానికి పంపారు.

టౌన్ ప్లానింగ్‌తో కలిసి..

జిల్లా పరిషత్ సమీపంలో ఓ భవన యజమానికి, హోటల్ యజమానికి మధ్య ఉన్న వివాదాన్ని సదరు నేత సెటిల్ చేసి రూ.15 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. జగనన్న కాలనీలు, ఇతర పనులు నిర్వహించిన ఒక కాంట్రాక్టర్‌ను బిల్లులు చెల్లించడానికి ముప్పుతిప్పలు పెట్టి రూ.కోటి వరకు వసూలు చేశారని సమాచారం. 15 ఏళ్లగా మూతబడి ఉన్న క్లబ్‌ను తెరిపించడానికి తెరచాటు ప్రయత్నాలు చేస్తున్నాడు. వన్‌టౌన్‌లో బంగారు షాపులపై సదరు నేత కన్నుపడింది. షాపులు ఖాళీ చేయాలని హుకుం జారీ చేసి కార్పొరేషన్ సిబ్బంది ద్వారా ఒత్తిడి తెచ్చారు. కోర్టుకు వెళ్లి షాపు నిర్వాహకులు స్టే తెచ్చుకున్నా.. భయంతో ఇద్దరు షాపులు అప్పగించినట్లు సమాచారం. ఒక కార్పొరేటర్‌పై సదరు నేత డైరెక్షన్‌లో దాడి చేశారు. ఖండ్రికగూడెంలో కల్యాణ మండపం వ్యవహారంలోనూ భారీ వసూళ్లకు పాల్పడ్డాడు. టౌన్‌ప్లానింగ్‌లో తన మాటే వేదమనే రీతిలో శాసిస్తూ దందా చేస్తున్నారు. వన్‌టౌన్‌లో శివ ఫుట్‌వేర్స్ సమీపంలో అనుమతి లేని సెల్లార్ నిర్మాణానికి, అంబికా థియేటర్ సమీపంలో అపార్ట్‌మెంట్ ఎన్‌ఓసీ కోసం, రిక్షా స్టాండ్ తొలగింపు వ్యవహారంలో, శనగపప్పు బజారులో ఒక భవన నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి వసూళ్లకు పాల్పడుతున్నారు.

రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్, లీడర్‌షిప్ రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వైద్య సదుపాయాలు కూడా లేకుండా శిక్షణ ఏర్పాటు వల్ల వైద్యం అందక ఉండి మండలం ఉణుదుర్రు జెడ్పీ స్కూల్ హెచ్ఎం రత్నకుమార్ మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జీ. కృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీ రత్నంబాబు, జీ మోహన్, డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీ శ్రీను, పీ వెంకటేశ్వర రావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్ళూరి రామారావు, బీ రెడ్డిదొర, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం ఆదినారాయణ వేర్వేరు ప్రకటనల్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహం పాక్షికంగా ధ్వంసం


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చిన్న వెల్లమిల్లిలో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పాక్షికంగా ధ్వంసమైంది. మంగళవారం రాత్రి కొందరు ఆకతాయిలు అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలును విరగ్గొట్టారు. దీంతో దళిత యువకులు ఆందోళన చేశారు. ఎస్సై సూర్య భగవాన్, డీటీ పోతురాజు, రెవెన్యూ సిబ్బంది పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. నిందితులను పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో దళితులు ఆందోళన విరమించారు. గ్రామస్తుల సాయంతో విరిగిన వేలును పునరుద్ధరించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. మాజీ సర్పంచి మెడంకుల రత్తయ్య మాట్లాడుతూ విగ్రహాన్ని ధ్వంసం చేసిన శిక్షించాలని కోరారు.

ముగిసిన బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ సెలెక్షన్స్


టేబుల్ టెన్నిస్ సెలెక్షన్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో జరుగుతున్న ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ బాక్సింగ్ మెన్, విమెన్‌లతో పాటు, టేబుల్ టెన్నిస్ మెన్ యూనివర్సిటీ టీం సెలెక్షన్స్ బుధవారం ముగిశాయి. టేబుల్ టెన్నిస్‌కు గాను మహమ్మద్ ఫిరోజ్, దంగేటి నవీన్‌కుమార్, కాపవసట్టి సురేంద్ర, రాయి రాముడు, నంగాలం అంజనీకుమార్లు ఎంపికవ్వగా, బాక్సింగ్ మహిళల విభాగంలో ఎన రేష్మ, కే లోకేశ్వరి, ఎల్ శిరీష, సీహెచ్ లావణ్య, కే దేవిశ్రీ, సీహెచ్ సాయి, వరలక్ష్మి, బాక్సింగ్ పురుషుల విభాగంలో సీహెచ్ పృథ్వీరాజ్, వీ పవన్, ఎం రవి, సీహెచ్ వెంకట్, బీ మోహన్‌రాజు, సి దినేష్, కే వెంకటసాయిరాం, బి సత్యతేజ రెడ్డి ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కే రామచంద్రరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు ప్రకటించారు. బాక్సింగ్ విభాగంలో 10 కళాశాలలు, టేబుల్ టెన్నిస్ పోటీలకు ఏడు కళాశాలల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

ద్వారకాతిరుమల: ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న ఇద్దరు యువకులపై మంగళవారం రాత్రి పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని గుణ్ణంపల్లికి చెందిన 14 ఏళ్ల బాలిక నల్లజర్లలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ప్రతి రోజూ పాఠశాలకు ఇంటి వద్ద నుంచే స్కూల్ బస్సులో వెళ్లి వస్తోంది. అయితే పక్క గ్రామమైన తక్కెళ్లపాడుకు చెందిన గంజి ప్రేమ్‌కుమార్, మద్దిరాల పోసిబాబు సుమారు 5 నెలల నుంచి ప్రేమ పేరుతో ఆ బాలిక వెంటపడి వేధిస్తున్నారు. ఈ విషయం బాలిక తన తండ్రికి చెప్పగా గ్రామ పెద్దల్లో పెట్టి ప్రేమ్‌కుమార్, పోసిబాబు మందలించారు. అయినప్పటికీ వారు బాలికను వెంటపడి వేధిస్తుండడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

తల్లీబిడ్డ సేవలు దూరం


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు


మూలకు చేరిన రెండు వాహనాలు

- కుంటుపడే దిశగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన సేవలు
- అరకొర డీజిల్‌తో నెట్టుకొస్తున్న వాహనాలు
- 4 నెలలుగా డ్రైవర్లకు జీతాలు నిల్
- మూలకు చేరుతున్న వాహనాలు
- కూటమి ప్రభుత్వ పనితీరుపై దుమ్మెత్తిపోస్తున్న ప్రజానీకం

తణుకు అర్బన్: ప్రసవం అయిన తరువాత తల్లి, బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చడంలో అందరి మన్ననలు అందుకుంటున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు నేడు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా కుంటుపడే దిశగా నడుస్తున్నాయి. సర్కారు దవాఖానాల్లో ప్రసవం అయిన బాలింతలు, శిశువులను ఇంటికి చేర్చే వాహనాలకు చంద్రగండం ఏర్పడే పరిస్థితి దాపురించింది. వాహనాల డ్రైవర్లకు 4 నెలల జీతాల బకాయిలు ఉండగా, వాహనాలు అరకొర డీజిల్‌తో సాగాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్న వాహనాలు సైతం మరమ్మతులు కూడా చేయించలేని స్థితికి చేరాయి. నాలుగు నెలలపాటు జీతాలు అందకపోవడంతో ఇప్పటికే వాహన డ్రైవర్ల ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 32 వాహనాలు ఉండగా పశ్చిమ జిల్లాలో 14 వాహనాలు, ఏలూరు జిల్లాలో 18 వాహనాలు సేవలందిస్తున్నాయి. ఈ వాహనాలకు ఒక్కొక్క డ్రైవర్ చొప్పున విధుల్లో ఉన్నారు. ప్రతిరోజూ ఈ వాహనాలు సుమారుగా 200 మందికిపైగా తల్లి, బిడ్డలను సురక్షితంగా వారి ఇంటికి చేరుస్తున్నాయి. అంతటి ప్రాధాన్యత ఉన్న వాహనాలపై ప్రభుత్వం కక్ష కట్టినట్లుగా వ్యవహరిస్తుండడంతో భవిష్యత్తులో వాహన సేవలు నిలిచిపోతాయా అనేట్లుగా ఆందోళన చెందుతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

గత ఐదేళ్లు ఘనంగా..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా కొత్త వాహనాలను ఎయిర్ కండిషన్ సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకువచ్చారు. అంతేకాకుండా ప్రభుత్వాసుపత్రుల నుంచి తమ ఇళ్లు ఎంత దూరమైనా వాహనంలోనే వెళ్లేలా మార్గదర్శకాలు తీసుకువచ్చి దూరప్రాంతాలకు సైతం తల్లి,బిడ్డను క్షేమంగా చేర్చేలా కార్యాచరణ చేసి అమలుపరిచారు. దీంతో బాలింతలు, వారి కుటుంబ సభ్యులు ఈ వాహన సేవలను కొనియాడే పరిస్థితికి ఈ సేవలు ఎగబాకాయి. అటువంటి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు నేడు మందగించే పరిస్థితికి కూటమి ప్రభుత్వం దిగజారుస్తుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే కొన్ని వాహనాలు మూలకు చేరే పరిస్థితి ఏర్పడింది. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఉండే 6 వాహనాల్లో రెండు మరమ్మతులు చేయించలేక మూలకు చేరగా, ఒక వాహనం మరొక ఆస్పత్రికి పంపించారు. ప్రస్తుతం మూడు వాహనాలు మాత్రమే సేవలందిస్తున్నాయి. ప్రసవాల కోసం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రెండు జిల్లా కేంద్ర ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లకు నిత్యం పదుల సంఖ్యలో గర్భిణులు 108, ప్రైవేటు వాహనాల ద్వారా చేరుతుంటారు. ప్రసవానంతరం బాలింతలను, బిడ్డలను ఎటువంటి నొప్పి తెలియకుండా సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నాయి ఈ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు. ఈ సమస్యపై వాహనాలకు సంబంధించిన జిల్లాస్థాయి అధికారులను 'సాక్షి' వివరణ కోరగా సమస్యల తాలూకా వివరాలను కప్పిపుచ్చుకునే విధంగా మాట్లాడుతుండడం శోచనీయం.

జీతాలు ఇవ్వకపోతే ఎలా..



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్లు 4 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. బాలింతలను సురక్షితంగా ఇంటికి చేరుస్తున్న వాహన సేవలపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరం. తక్షణమే వాహన డ్రైవర్లకు జీతాల బకాయిలు చెల్లించడంతోపాటు వాహనాలన్నీ కండిషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– కోనాల భీమారావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు

క్రీడలతో దేహదారుఢ్యం

- నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల విజేతలకు బహుమతి ప్రదానం


గోగులంపాడులో చెడుగుడు విజేతలకు ప్రథమ బహుమతి అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే తదితరులు

చింతలవల్లి (ముసునూరు): క్రీడలతో దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం, సమయ పాలన, క్రీడా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు అలవడతాయని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ముసునూరు మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు-కొత్తూరులో గత వారం రోజులుగా జరిగిన 59వ రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల విజేతలకు జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్ అధ్యక్షతన మంగళవారం రాత్రి బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ గ్రామంలో గత 59 ఏళ్లుగా నిర్విఘ్నంగా రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గోగులంపాడు చెడుగుడు కమిటీ కృషిని అభినందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను వరుసగా విజయవాడ స్కై టీమ్, ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట శ్రీశ్రీ టీమ్‌లు సాధించగా, గోగులంపాడు బాహుబలి టీమ్, చింతలవల్లి ఆరు బుల్లెట్స్ టీమ్ మూడవ, నాలుగో స్థానాల్లో నిలిచాయి. విజేతలకు మాజీ ఎమ్మెల్యే నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్ పి.సత్యనారాయణ, ఎంపీటీసీ పి.సుధాకర్, సొసైటీ మాజీ అధ్యక్షుడు సుగసాని శ్రీనివాసరావు, మండల, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, శీలం రామయ్యారావు, తొర్లపాటి సాంబశివరావు, పలగాని కోటేశ్వరరావు, తాళ్ల శ్రీనివాసరావు, చాకిరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించాలని వినతి


వినతిపత్రం అందజేసిన ఆగిరిపల్లి మండల ప్యాప్టో నాయకులు

ఆగిరిపల్లి: ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లోనే శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆగిరిపల్లి మండల ప్యాప్టో నాయకులు కోరారు. తోటపల్లి హీల్ పాఠశాలలో శిక్షణ కేంద్రానికి వచ్చిన సమగ్ర శిక్ష రాష్ట్ర డైరెక్టర్ వి.మస్తానయ్య, జిల్లా విద్యాశాఖ అధికారిని ఎం.వెంకటలక్ష్మిని బుధవారం ఆగిరిపల్లి మండల ప్యాప్టో నాయకులు కలిశారు. హెచ్ఎం రత్నకుమార్ గుండెపోటుతో మరణించారని, ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ విధానంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను వెంటనే నిలుపుదల చేసి, మృతి చెందిన హెచ్ఎం కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. దీనిపై సమగ్ర శిక్ష రాష్ట్ర డైరెక్టర్ వి.మస్తానయ్య స్పందిస్తూ శిక్షణ తరగతులను తాత్కాలికంగా నిలుపుదల చేసి ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు రత్నకుమార్ కుటుంబానికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను అతి త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి ఎస్టీయూ మండల అధ్యక్షుడు మక్కే వేణుగోపాల్, కార్యదర్శి అంకం వెంకటేశ్వరరావు, ఆగిరిపల్లి మండల ప్యాప్టో నాయకులు చొటపల్లి సురేష్, తాడి ప్రసాద్, కే. అజరయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సూర్యారావుపాలెం ఘటన తీవ్ర విషాదాంతం

గాయపడి చికిత్స పొందుతున్న వారంతా మృతి

తణుకు: ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామంలో ఇటీవల జరిగిన భారీ విస్ఫోటనంలో మృతుల సంఖ్య ఏడుకు చేరుకుంది. గత నెల 30న బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడిన ఘటనలో తణుకు మండలం వెంకట్రాయపురం గ్రామానికి చెందిన వేగిరోతు శ్రీవల్లి, పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గుమ్మడి సునీత ఘటనా స్థలంలోనే సజీవ దహనం అయిన విషయం తెలిసిందే. కాగా ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో 5గురిని తొలుత తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇరగవరం మండలం కావలిపురం గ్రామానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు చికిత్స పొందుతూ మృతి చెందగా, ఈనెల 5న తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన కడియం కుమారి, పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన శీలం లక్ష్మి, మండలంక కమలరత్నం చికిత్స పొందుతూ మృతి చెందారు. బుధవారం తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన చుక్కా పెద్దింట్లు (45) మృతి చెందారు. దీంతో ఈ ఘోర ప్రమాదంలో గాయపడిన వారంతా మృతి చెందినట్లు అయ్యింది.


చుక్కా పెద్దింట్లు (ఫైల్)

కూలి పనులు చేసుకుంటూ...

తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన చుక్కా పెద్దింట్లు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. నెల రోజుల క్రితమే బాణసంచా తయారీ కేంద్రంలో రోజువారీ కూలీగా చేరారు. పెద్దింట్లుకు కుమార్తె ప్రసన్న ప్రవల్లిక, కుమారుడు సాయికిరణ్ సంతానం. వీరికి వివాహాలయ్యాయి. పెద్దింట్లు భర్త ముసలయ్య పదేళ్ల క్రితం వదిలేసి వెళ్లిపోవడంతో ఆమె ఒంటరిగానే జీవిస్తున్నారు. మనస్పర్థల కారణంగా కోడలు సైతం పుట్టింటికి వెళ్లిపోవడంతో ప్రస్తుతం కొడుకు సాయికిరణ్‌తోపాటు నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆమె మృతితో గ్రామంలో విషాధచాయలు అలముకున్నాయి.

చెరువు రగడపై చింతమనేని స్పందించాలి


మీడియాతో మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

ఏలూరు రూరల్: ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం మొండికోడులో మంగళవారం జరిగిన చేపల చెరువు రగడపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్పందించాలని జనసేన నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం ఆమె ఏలూరు రూరల్ ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజుతో పాటు మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని చేపల చెరువును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అటవీశాఖ మంత్రి అయినందునే కొల్లేరు గ్రామాల్లో చేపల పట్టుబడిపై వివాదాలు నెలకొంటున్నాయనే దుష్ప్రచారం జరుగుతోందన్నారు. దీనిని జనసేనతో పాటు టీడీపీ నాయకులు సైతం ఖండించాలన్నారు. అభయారణ్యం పరిధిలోని చెరువుల్లో చేపల సాగును అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని గుర్తుచేశారు. ఉపాధి లేక గత్యంతరం లేని పరిస్థితిలో కొల్లేరు ప్రజలు కొట్టేసిన చెరువుల్లో చేపలు సాగు చేసుకుని జీవిస్తున్నారని అన్నారు. దీన్ని గుర్తించి అటవీశాఖ అధికారులు మానవతా దృక్పథంతో చేపల పట్టుబడికి సహకరించాలన్నారు. ఈ విషయాన్ని జనసేన అధినాయకత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. వెంకటలక్ష్మి మీడియాతో మాట్లాడుతుండగా తిమ్మారావుగూడెం గ్రామస్తులు వచ్చి అడ్డుకున్నారు. మీ వల్లనే వివాదాలు వస్తున్నాయని ఆరోపించారు. మీడియా ప్రతినిధులపై సైతం దురుసుగా వ్యవహరించారు. పోలీసులు కల్పించుకుని వారిని గ్రామాలకు పంపించేశారు.

ఏలూరు అథ్లెట్లకు పతకాలు


అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు


వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన క్రీడాకారిణులు

జాతీయ పోటీలకు ఇద్దరు ఎంపిక

ఏలూరు రూరల్: ఏలూరు సాయ్ (ఖేలో ఇండియా స్టేట్ లెవల్ సెంటర్) క్రీడాకారులు అద్భుత ప్రతిభ చాటి పతకాల పంట పండించారని సెంటర్ ఇన్‌చార్జి డీఎస్‌వీ వినాయక్‌ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటి, జాతీయ పోటీలకు అర్హత సాధించారని కొనియాడారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు శ్రీకాకుళంలోని కోడి శ్రీరామమూర్తి స్టేడియంలో అండర్ 17 ఎస్‌జీఎఫ్ పోటీలు జరిగాయన్నారు. ఇందులో అథ్లెటిక్స్ విభాగంలో డి ఉదయం, జి వెంకట్‌లోకేష్ బి సెలీని, తేజస్వని, సీహెచ్ భార్గవి బంగారు పతకాలు సాధించారన్నారు. ఏ మణికంఠ, ఎన్ పవన్, టి లక్ష్మీహర్ష, పి నిత్యహాసిని సిల్వర్‌తో పాటు బ్రాంజ్‌మెడల్స్ సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈనెల 2, 3, 4 తేదీల్లో తెనాలిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సెంటర్ బాలికలు ఎం పావని, సీహెచ్ కీర్తన 2 బంగారు పతకాలు, సీహెచ్ హారికరెడ్డి 1 సిల్వర్, జి పవిత్ర, కె మేఘన, ఎస్ విహారిక 3 బ్రాంజ్ మెడల్స్ గెలుపొందారని వివరించారు. పోటీల్లో ప్రతిభ చాటిన పావని, కీర్తి మణిపూర్‌లో డిసెంబర్ 2 నుంచి జరిగే జాతీయ పోటీలకు పాల్గొనే అవకాశం దక్కించుకున్నారన్నారు. మొత్తంగా సెంటర్ క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో 7 పతకాలు, వెయిట్ లిఫ్టింగ్‌లో 6 పతకాలు సాధించారన్నారు. విజేతలను కోచ్ ప్రీతిచౌదరి, అసిస్టెంట్ కోచ్ కృష్ణకుమారి, డీఎస్‌డీఓ బి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడేటి చంటి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: మోటార్‌సైకిల్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన చాకలి చిట్టిబాబు (40) మోటారు సైకిల్‌పై కరీంనగర్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఏలూరు జాతీయరహదారి దుగ్గిరాల బ్రిడ్జి దాటిన అనంతరం మోటారుసైకిల్ ముందు చక్రం టైరు పంక్చర్ అయింది. దీంతో మోటారు సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఐరన్ గ్రిల్స్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్సు సిబ్బంది అతడిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు పరీక్షిస్తుండగా మృతి చెందాడని నిర్ధారించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔటోపోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

ఉండి: మతిస్థిమితం లేని తన భర్త కనిపించడం లేదంటూ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నసీరుల్లా తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం యండగండి గ్రామానికి చెందిన చింతల రాము (42) ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గతంలో ఇదే విధంగా ఇంటి నుంచి వెళ్లి మూడు రోజుల్లో తిరిగి ఇంటికి వచ్చేశాడు. అయితే ఈ సారి రాకపోవడంతో రాము భార్య పద్మ పోలీసులను ఆశ్రయించింది.

రేషన్ బియ్యం పట్టివేత

పెనుగొండ: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టరు పి.శివరామకృష్ణ తెలిపారు. బుధవారం సిద్ధాంతం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఏపీ 05 టీడీ 9921, ఏపీ 39 టీజే 8358 వాహనాల్లో 30 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వాహనాల యజమానులు అనిల్‌కుమార్, జి.వీరబాబును ప్రశ్నించగా రేషన్ బియ్యాన్ని కిలో రూ.19కు కొనుగోలు చేసి ఆచంటకు చెందిన జి విశ్వనాథ గుప్త, ఆలమూరుకు చెందిన పి.గంగరాజు ద్వారా రూ.21కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. బియ్యాన్ని, వాహనాలను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(అనుబంధం -) రూల్ 8(1) మరియు 8(2) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002

... రూ.20,15,637/- ... 30.08.2024 ...

స్వాధీన ఆస్తి వివరాలు

స్థలం : ఏలూరు
తేది : 01.11.2024

సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం


కైకరంలో పోటీలను ప్రారంభిస్తున్న డీవైఈవో రవీంద్రభారతి

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండులో అండర్ 14 బాలుర, బాలికల అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలను బుధవారం తాడేపల్లిగూడెం డీవైఈవో రవీంద్ర భారతి ప్రారంభించారు. హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో పరిశీలకులు పీడీ ప్రసాదరెడ్డి, ఒలింపిక్ జిల్లా కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి అలివేలు మంగ, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ అల్లూరి జగదీశ్వరి పాల్గొన్నారు.

విజేతలు వీరే

హైజంప్ బాలికల విభాగంలో బి.ఇసానా (వైజాగ్), సీహెచ్ భావన (తూర్పుగోదావరి), కె. లక్ష్మీ ప్రియా (చిత్తూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. బాలురు విభాగంలో వి.రాఘవేంద్ర, (విజయనగరం), డి.రహీం (ప్రకాశం), కె.రాఘవేంద్ర, (వైఎస్సార్ కడప), లాంగ్ జంప్ బాలికల విభాగంలో జి.కొండల లక్ష్మి (తూర్పుగోదావరి), ఎం.రిషిత (కర్నూలు), పి.మానస (శ్రీకాకుళం), బాలుర విభాగంలో ఎం.పెంచల్ బాబు (వైఎస్సార్, కడప), వి.రాజేష్ (విశాఖ), డి.వెంకట శివప్రకాశం విజయం సాధించారు. షాట్ పుట్ బాలికల విభాగంలో ఎం.కరిష్మా (గుంటూరు), పి.రితిక (నెల్లూరు), డి.లాస్య (చిత్తూరు), బాలుర విభాగంలో జి చంద్రశేఖర్ నాయుడు (విశాఖ), బి.భరత్‌చంద్ర (శ్రీకాకుళం), వి.గణేష్ (శ్రీకాకుళం) విజయం సాధించారు. డిస్కస్ త్రో బాలుర విభాగంలో జి.చంద్రశేఖర్ నాయుడు (విశాఖ), బి.వెంకటేష్ (కర్నూలు), టి విన్సెంట్ (ప్రకాశం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.

నక్కావారిపాలెంలో చోరీ

పెనుగొండ: సిద్ధాంతం శివారు నక్కావారిపాలెంలో సాదా నాగేశ్వరరావు ఇంట్లో చోరీ జరిగి 25 కాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు ఎస్సై కే గంగాధర్ తెలిపారు. నాగేశ్వరరావు, అతని భార్య మంగళవారం రాత్రి ఇంటిలోని హాల్‌లో నిద్రిస్తుండగా దొంగలు ఇంటి గ్రిల్స్ తొలగించి బెడ్‌రూంలోకి వెళ్లి బీరువాలోని 25 కాసుల బంగారు ఆభరణాలు అపహరించారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం నర్సాపురం సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ, పెనుగొండ సీఐ రాయుడు విజయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2571]

Wanted

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253909]

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ18k Ph: 9912011899, 9912011499 [SCA-24000548]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD.7995385999 [HA-98930]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com సాక్షి స్పోర్ట్స్